రోడ్డు విస్తరణకు బ్రేక్

ఆరిలోవ ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి మధ్యలోనే బ్రేక్ పడింది. సాధారణ ఎన్నికలకు ముందు ఇక్కడ రూ.కోట్లతో ప్రారంభమైన రోడ్డు అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. రహదారి విస్తరణ వల్ల కొందరు టీడీపీ నాయకుల ఇళ్ల భాగాలు పోతాయని, మరికొందరి వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతుందనే నెపంతో అభివృద్ధిని ఏకంగా ఆపేశారు.

- ఆరిలోవలో మధ్యలోనే నిలిచిపోయిన రహదారుల అభివృద్ధి
- తోటగరువు, అంబేడ్కర్ కూడలి, పార్వతీనగర్ మార్గంలో ఆగిన పనులు
- ఇళ్లు, వ్యాపారాలు పోతాయని.. పనులకు అడ్డుపడిన టీడీపీ నాయకులు


ఇరుకు రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న బస్సులు, ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆరిలోవ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కృషితో బీఆర్‌టీఎస్ రహదారిలో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్, అంబేడ్కర్ కూడలి, పార్వతీనగర్ వరకు బ్రిడ్జితోపాటు సుమారు కిలోమీటర్‌కు పైగా డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.11.49 కోట్లతో పనులు చేపట్టారు. ఇవి ఈ ఏడాది జనవరిలో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల వరకు కొంతమేరకు పూర్తయ్యాయి. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మిగిలిన పనులకు బ్రేక్ పడింది. ప్రజలకు ఉపయోగపడే ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

నాడే నిధుల కేటాయింపు..

పెదగదిలి–తోటగరువు మధ్యలో రూ.3.45 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. ఎన్నికలకు ముందే 90 శాతం వంతెన పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి మిగిలిన పనులు పూర్తి చేశారు. ఇది వినియోగంలోకి కూడా వచ్చింది. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు పైగా కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.3.76 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో సుమారు కిలోమీటరు పైగా రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ మీడియా(డివైడర్), వీధిలైట్ల ఏర్పాటు కోసం జీవీఎంసీ అధికారులు మరో రూ.1.75 కోట్లు, వీటితోపాటు సూర్యతేజనగర్ బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, పార్వతీనగర్ వద్ద క్రాస్ కల్వర్టు విస్తరణ, సెంట్రల్ మీడియా(డివైడర్), సెంట్రల్ లైటింగ్ కోసం రూ.2.53 కోట్లు కేటాయింపులు చేశారు. వీటిలో పెదగదిలి వద్ద బ్రిడ్జి నిర్మాణం వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగానే పూర్తయింది. రోడ్డు విస్తరణ, అభివృద్ధి మాత్రం కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు నిలిపేశారు.


తోటగరువు వద్ద మధ్యలో నిలిచిన డివైడర్ పనులు

ఇళ్లు, వ్యాపారాలకు నష్టం కలుగుతుందట..

ఈ రోడ్డు విస్తరణ జరిగితే ఆరిలోవ ప్రాంతం రూపురేఖలు మారుతాయని స్థానికులు భావించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉంటాయనుకున్నారు. వారి ఆశలకు కొందరు స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకట్ట వేశారు. తోటగరువులో టీడీపీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ ఇంటి ముందు భాగంతో పాటు మరికొందరు బీజేపీ, టీడీపీ నాయకులకు చెందిన ఇళ్ల భాగాలను రోడ్డు విస్తరణలో అధికారులు తొలగించాల్సి ఉంది. దానివల్ల తోటగరువు, బాలాజీనగర్‌ల్లో ఆ పార్టీ నాయకులకు చెందిన రోడ్డును ఆనుకొని ఉన్న షాపులు తీయాల్సి వస్తుంది. దీంతో ఎవరి కోసమో రోడ్డు నిర్మిస్తే.. మా ఇళ్ల భాగాలు, షాపులు కోల్పోతామని, అద్దెలు కోల్పోయి నష్టపోతామని ఆ నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వద్ద మొరపెట్టుకున్నారట. ఎమ్మెల్యే స్పందించి అక్కడ రోడ్డు పనులు ఆపేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అంతవరకు ఆ రోడ్ల మధ్యలో డివైడర్ నిర్మాణం కోసం తవ్విన గోతులను అధికారులు కాంక్రీట్ వేసి కప్పేశారు. విస్తరణ పనులు కాస్తా నిలిచిపోయాయి.

వేలాది మందికి ఇబ్బంది..

ఆరిలోవ కాలనీ నుంచి బీఆర్‌టీఎస్ రహదారి మీదుగా నిత్యం వేలాది మంది ప్రజలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ సిటీ బస్‌లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో రోజూ అంబేడ్కర్ కూడలి నుంచి అటు సూర్యతేజనగర్ మీదుగా చినగదిలి కూడలికి.. ఇటు తోటగరువు మీదుగా పెదగదిలి జంక్షన్‌కు చేరుతుంటారు. వేల వాహనాలు తిరుగుతుండటంతో ఆయా రహదారుల విస్తరణ, డబుల్ రోడ్ల నిర్మాణం అవసరం. టీడీపీ నాయకుల స్వార్థం కోసం, వారికి లాభం చేకూర్చాలనే ఆలోచనతో స్థానిక ఎమ్మెల్యే వేల మందికి ప్రజలకు ఉపయోగపడే రహదారుల పనులు నిలిపేయడం నిరంకుశత్వ తీరని స్థానికులు మండిపడుతున్నారు. జరుగుతున్న పనులను ఆపేసి ఆరిలోవ ప్రజలకు తీరని సమస్యను మిగల్చడం మంచి విధానం కాదని హితవు పలుకుతున్నారు. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు తగిన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే వెలగపూడిపై రుసురుసలాడుతున్నారు.


ఆరిలోవ బాలాజీనగర్‌లో డివైడర్ నిర్మాణం కోసం తవ్విన గోతుల్లో వేసిన కాంక్రీట్


తోటగరువులో కాంక్రీట్‌తో కప్పేసిన డివైడర్ కోసం తవ్విన గోతులు

> **టౌన్ ప్లానింగ్ విభాగం క్లియరెన్స్ ఇవ్వాలి**
>
> ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరుపక్కలా ఇళ్ల భాగాలు తొలగించాల్సి ఉంది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వాటిని తొలగించి అప్పగించలేదు. అందుకే మధ్యలోనే పనులు నిలపాల్సి వచ్చింది. ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే డివైడర్ల కోసం తవ్విన గోతులను కాంక్రీట్‌తో మూసివేశాం.
>
> – వెంకటరావు, ఏఈ, జీవీఎంసీ

ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

అల్లిపురం: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్యం నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో–జీరో పొల్యూషన్ కార్యక్రమాల్లో భాగంగా నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతోందన్నారు. వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను, సైకిళ్లను ఉపయోగించడం వల్ల నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, ప్రజలందరూ సహకరించాలని కోరారు.

‘చలో వాల్తేరు డిపో’ నేడు

మద్దిలపాలెం: విశాఖ జిల్లా ప్రజా రవాణా శాఖలో అపరిష్కృత సమస్యలపై మంగళవారం నిర్వహించనున్న చలో వాల్తేరు డిపో కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వాల్తేరు డిపో వద్ద అనేక రోజులుగా, అనేక రకాలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్య మొండివైఖరికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. విశాఖ జిల్లా సత్తా చూపించాలని, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అన్ని డిపోల నుంచి భారీగా ఉద్యోగులు తరలి రావాలని వారు కోరారు.

క్లుప్తంగా

ఏయూ సందర్శన


ఏయూ వీసీ శశిభూషణరావుకు మొక్క బహూకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విశాఖ సిటీ: ఏపీఎస్పీ 15వ బెటాలియన్ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సోమవారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ రంగాల్లో ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ వివరించారు.

సీఎం సహాయ నిధికి రూ.2.58 లక్షల విరాళం


ఏయూ రిజిస్ట్రార్‌కు చెక్కు అందిస్తున్న ప్రగతి విద్యా సంస్థల కరస్పాండెంట్ శ్రీనివాసరావు

విశాఖ సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రగతి విద్యా సంస్థలు రూ.2.58 లక్షల విరాళం అందజేశాయి. సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును ప్రగతి విద్యా సంస్థల కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రగతి కాలేజీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెంలో సామాజిక భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి సోమవారం విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాల్‌పై రెండో అంతస్తు నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.30 లక్షలు కేటాయించింది. ఈ పనులను ప్రారంభించిన ఎంపీ మాట్లాడుతూ నిర్మాణం త్వరగా జరిపించి స్థానికులకు భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ శాంతిరాజు, ఏఈ వెంకటరావు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ స్థానిక నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం


రమ

మర్రిపాలెం: కుమార్తెతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా చీపురుపల్లిలో భర్త, కుమార్తెతో కలిసి నివసిస్తున్న రమ ఈ నెల 18న కంచరపాలెం ధర్మానగర్ శివాలయం వీధిలో ఉంటున్న తల్లి వద్దకు కుమార్తెను తీసుకుని వచ్చింది. అనంతరం ఈ నెల 22న తెల్లవారుజామున కుమార్తెను తీసుకుని కుళాయి నీరు తీసుకొచ్చేందుకు వెళ్లిన రమ ఎంతకీ రాకపోవడంతో ఆమె సోదరుడు ఎం.సాయి సోమవారం రాత్రి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ ఏపీపీలకు అన్యాయం


మాట్లాడుతున్న డాక్టర్ గణపతి

మద్దిలపాలెం: ఇటీవల జరిగిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఏపీపీలకు తీవ్ర అన్యాయం జరిగిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) ఉత్తరాంధ్ర అధ్యక్షుడు డాక్టర్ కొంగరపు గణపతి ఆరోపించారు. మద్దిలపాలెం తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఈ నెల 21న బదిలీల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వీటిలో రాష్ట్ర వ్యాప్తంగా 98 మంది లా ఆఫీసర్లను ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. జోన్–1 పరిధిలోని శ్రీకాకుళం, రాజాం, కోటబొమ్మాళి, గజపతినగరం, కొత్తవలస, భీమునిపట్నం, యలమంచిలి, విశాఖ, వి.మాడుగుల కోర్టుల్లో 13 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బదిలీ అయ్యారన్నారు. ఈ బదిలీల్లో సమన్యాయం జరగలేదని ఆరోపించారు. వీటిపై పునరాలోచించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని గణపతి కోరారు.

డీఎన్‌సీఎస్ కొత్త కార్యవర్గం ఎంపిక


సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు

ఎంవీపీకాలనీ: డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ(డీఎన్‌సీఎస్)కి కొత్త కార్యవర్గం ఎన్నికైంది. పెదవాల్తేరు ఆర్‌సీడీ ప్రభుత్వ ఆస్పత్రిలోని బయోడైవర్సిటీ పార్క్‌లో సోమవారం సంస్థ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్‌సీఎస్ సలహాదారు ఆచార్య కామేశ్వరరావు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సొసైటీ కొత్త అధ్యక్షుడిగా ఎం.రామమూర్తి, ఉపాధ్యక్షుడిగా జె.ఎ.స్.ప్రసాద్, కార్యదర్శిగా సి.వి.జోగారావు, కోశాధికారిగా ఎం.మంగతాయి, సంయుక్త కార్యదర్శిగా కె.ఎస్.ఉమాబాల, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సి.గాయత్రి, బి.పద్మ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంస్థ సభ్యులు అభినందించారు.

టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేత లక్ష్మీసహస్ర


లక్ష్మీసహస్ర గీసిన చిత్రం


సహస్రను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

టీచర్స్‌రోడ్డు: విశాఖ నగరానికి చెందిన యంగ్ ఆర్టిస్ట్ పేరూరి లక్ష్మీసహస్ర 17వ గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్‌లో విజేతగా నిలిచింది. ‘టయోటాస్ మెమరీ కార్’ పేరుతో ఆమె రూపొందించిన ఊహాత్మక సృష్టి 90 దేశాల్లో 7,12,845 ఎంట్రీల నుంచి టాప్ 26 ప్రపంచ ఫైనలిస్ట్‌ల్లో స్థానం సంపాదించుకుంది. 12–15 ఏళ్ల విభాగంలో సాధించిన అత్యుత్తమ విజయానికి గుర్తింపుగా లక్ష్మీసహస్రకు యూఎస్ డాలర్లు 3,000 బహుమతి లభించింది. టీకేయం ప్రాంతీయ ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ 2004లో టయోటా మోటార్ కార్పొరేషన్(టీఎంసీ) ఈ కాంటెస్ట్ ప్రారంభించినట్లు తెలిపారు. పిల్లలు వారి డ్రీమ్ కార్లను ఊహించడానికి, రూపొందించడానికి ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తోందన్నారు. లక్ష్మీసహస్రను ఉపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు.

స్థలం తగాదాలో ముగ్గురికి రిమాండ్

ఆరిలోవ: ఓ స్థలం వివాదంలో ముగ్గురిని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. చినగదిలి దీన్‌దయాళపురంలో దంగేటి మరిడయ్య నుంచి అతడి కుమారులు డి.కనకరాజు, డి.శివప్రసాద్, డి.శ్రీనివాసరావు, డి.అప్పలరాజుకు 144 చదరపు గజాల స్థలం వారసత్వంగా సంక్రమించింది. నలుగురు అన్నదమ్ముల మధ్య ఆ స్థలం వ్యవహారంలో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం దంగేటి శివప్రసాద్, డి.శ్రీనివాసరావు, వాళ్ల కుటుంబ సభ్యుడు డి.మురళీకృష్ణ వారి స్థలంలో పనిచేస్తున్నారు. అదే సమయంలో దంగేటి కనకరాజు, అతడి కుమారులు డి.శివకృష్ణ, డి.వరప్రసాద్ ఆ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి మురళీకృష్ణపై దాడి చేశారు. దీంతో మురళీకృష్ణ తనపై కనకరాజు, అతడి కుమారులు దాడి చేసినట్లు అదేరోజు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి కనకరాజు, అతడి కుమారులను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ స్థలం తగాదాలో పోలీసులపై మాత్రం ఎవరూ దాడికి పాల్పడలేదని ఎస్‌ఐ కృష్ణ స్పష్టం చేశారు.

ఆలయాల నిర్వహణ నుంచి ప్రభుత్వాలు తప్పుకోవాలి

మద్దిలపాలెం: రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం సెక్యులర్ అయినప్పుడు హిందూ ఆలయాలు మాత్రమే ప్రభుత్వ పాలనలో ఉండకూడదని రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ రక్షణ, హిందూ మత ప్రచారం కోసం ఆలయాలకు వచ్చే ఆదాయాన్ని, ఇతర వనరులను ఉపయోగించక పోవడమే కాక.. ఆలయాల ట్రస్ట్ బోర్డులను రాజకీయ నాయకులతో నింపడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆలయాల నిర్వహణ నుంచి ప్రభుత్వాలు తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏయూ విభాగాల తనిఖీ


తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు, కమిటీ సభ్యులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు నేతృత్వంలో కమిటీ సభ్యులు సోమవారం ఏయూలోని పలు విభాగాల్లో బోధన తరగతులను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, పొలిటికల్ సైన్స్–పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, సంస్కృతం, లైబ్రరీ–ఇన్ఫర్మేషన్ సైన్స్, ఆంత్రపాలజీ విభాగాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. తరగతుల నిర్వహణను గమనించి, విద్యార్థులతో మాట్లాడారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరు, ఇతర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, కమిటీ సభ్యులు కె.ఈశ్వర్‌కుమార్, కె.రాజేంద్రప్రసాద్, డి.నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాల వినతి

మహారాణిపేట: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో 50 శాతానికి పైగా ఫీజు రాయితీ కల్పించాలని, పెండింగ్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు జర్నలిస్టు సంఘాలు వినతిపత్రాన్ని అందజేశాయి. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం కింద జర్నలిస్టుల ప్రీమియం చెల్లింపునకు సీఎస్సార్ నిధులు కేటాయించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు అధికంగా ఉండటం వల్ల జర్నలిస్టులకు భారమవుతోందని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతంలో విశాఖతోపాటు కొన్ని జిల్లాల్లో ఫీజు రాయితీ కల్పిస్తూ మెమో ఉత్తర్వులు జారీ చేశారని, ఈ ఏడాది కూడా రాయితీ కల్పించి సహకరించాలని కోరారు. జర్నలిస్టులకు ప్రెస్ అక్రిడేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే జారీ చేసి హెల్త్ కార్డులు పొందేందుకు అవకాశం కల్పించాలన్నారు. స్పందించిన కలెక్టర్ సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌తో మాట్లాడి అక్రిడేషన్ల సమస్య పరిష్కరిస్తానని, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయితీకి సహకరిస్తానని తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవాలో ‘బుల్లయ్య’ విద్యార్థులు



సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలతో బుల్లయ్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు

సీతంపేట: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల సమీపంలోని రేసపువానిపాలెంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను స్థానికులకు వివరించారు. బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.సతీష్ నాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


నృత్య పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న కంచర్ల అచ్యుతరావు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి రాధాకృష్ణనగర్‌లో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉత్సవ నిర్వాహకులు మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులకు నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు బహుమతులు అందజేసి, అభినందించారు. దీంతోపాటు ఈ ప్రాంతంలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలు అందించడం మంచి విధానమని ఉత్సవ కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జిమ్ పరికరాలకు రెక్కలు

- ఓ అపార్ట్‌మెంట్‌లో దర్శనం
- ఎలా వచ్చాయో తెలియదంటున్న అపార్ట్‌మెంట్‌వాసులు
- ‘సాక్షి’, జీవీఎంసీ అధికారుల దృష్టికి తెచ్చిన వైనం





జీవీఎంసీ పార్కుల్లో ఉండాల్సిన ఓపెన్ జిమ్ పరికరాలకు రెక్కలొచ్చాయి. సరాసరి విశాఖ ఐ హాస్పిటల్ దరి ఓషన్ అపార్ట్‌మెంట్‌లోకి చేరాయి. ఇవి ఎవరు తరలించారు? ఇక్కడికి ఎలా వచ్చాయో తెలియకపోవడంతో అపార్ట్ వాసులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని ‘సాక్షి’ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన పరికరాలను ఇలా ఓ ప్రైవేట్ **అపార్ట్‌మెంట్‌లో దాచిపెట్టడం నిబంధనలకు** విరుద్ధం. ఒక వేళ పాడైన స్థితిలో ఉంటే వాటిని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం పరిధిలోని స్టోర్‌లకు తరలించాల్సి ఉంటుంది. అయితే అలా కాకుండా అపార్ట్‌మెంట్‌లో దాచిపెట్టడం వెనుక ఎవరి హస్తం ఉందో తెలియాల్సి ఉంది. జీవీఎంసీ అధికారులకు సైతం అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు.

– ఎంవీపీకాలనీ



